రుణ ప్రణాళికలో లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

మహబూబాబాద్, ఫిబ్రవరి 16 : రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. 2024-25కు సంబంధించి రూ.4,044 కోట్ల అంచనాతో రూపొందించిన రుణ ప్రణాళికను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. 2023-24లో రూ.3,222.79 కోట్లకు గాను రూ.2,643.66 కోట్ల లక్ష్యాన్ని సాధించి 82.03 శాతంతో ఉన్నామన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఔత్సాహికులను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. అలాగే జిల్లాలో పోడు పట్టాలు అందజేసిన రైతులకు రుణాలను ఇవ్వాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పురుషోత్తం, పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, పరిశ్రమల శాఖ అధికారి సూర్యనారాయణ, నా బార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఆర్బీఐ డీడీవో ఎండీ అలీబాబా, ఎల్డీఎం సత్యనారాయణ, ఏపీజీవీబీ ఆర్ఎం శ్రీధర్, డీసీసీబీ ఏజీఎం రాధిక పాల్గొన్నారు.

రుణప్రణాళికలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్

'ఫ్రైడే - డ్రైడే' నిర్వహించాలి : డీఎంహెచ్‌వో

మహబూబాబాద్, ఫిబ్రవరి 16 : ప్రతి శుక్రవారం 'ఫ్రై డే – డ్రై డే' నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి అంబరీష ప్రజలకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో జిల్లాలోని అన్ని దవాఖానలు, పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు కీటక జనిత వ్యాధుల నివారణపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. జిల్లాలో కీటక సంబంధిత వ్యాధులైన మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. గ్రామాల్లో దోమల స్వైరవిహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రజలు డ్రై డే కార్యక్రమం ద్వారా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, డీఐవో నాగేశ్వర్‌రావు, రాంబాబు, ప్రత్యూష, శ్రవణ్‌కుమార్, కృష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, గోపిచంద్, పురుషోత్తం పాల్గొన్నారు.

నేడు సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 16: జిల్లా కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించేందుకు నేడు హైకోర్టు జడ్జిలు ఎన్ రాజేశ్వర్‌రావు, జే శ్రీనివాసరావు రానున్నారు. ఉదయం 7 గంటలకు కురవి వీరభద్రస్వామి ఆలయం, 8:30 గంటలకు అనంతారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. 9:30 గంటలకు ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోనున్నారు. అనంతరం 12:30 గంటలకు జిల్లా అడ్వకేట్స్, అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ఆటో డ్రైవర్ల జీవనం దుర్భరం : సీఐటీయూ

బయ్యారం, ఫిబ్రవరి 16: రాష్ట్రప్రభుత్వ విధానంతో ఆటోడ్రైవర్ల జీవనం దుర్భరంగా మారిందని సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న అన్నారు. ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మానవహారం, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్కే యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఈ దుస్థితికి ప్రభుత్వమే కారణమని, తమ సమ్యలను పరిష్కరించాలన్నారు. సురేశ్‌గౌతమ్, శీను, వీరన్న, ఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

గార్ల, ఫిబ్రవరి 16 : పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రముఖ సైకాలజిస్టు, మహబూబాబాద్ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధిక అన్నారు. శుక్రవారం గార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. మద్దివంచ, గోపాలపురం, కొత్త పోచారం, గార్ల, పెద్ద కృష్ణాపురం గ్రామాల విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు రవీందర్, జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్‌అజాద్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, రమేశ్, భాస్కర్, పద్మ, చంద్రమోహన్, మంగీలాల్, రాంబాబు పాల్గొన్నారు.

ఇనుగుర్తి: రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు



నర్సింహులపేట : సమ్మెలో పాల్గొన్న పార్టీల నాయకులు

నెల్లికుదురు: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సమ్మె సక్సెస్

- జిల్లాలో గ్రామీణ భారత్‌బంద్ విజయవంతం
- అఖిలపక్షం నాయకులు, ప్రజా సంఘాల ర్యాలీలు, రాస్తారోకోలు
- కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని డిమాండ్

మహబూబాబాద్/ మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 16: కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, ప్రజల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంతోపాటు అటు రైతులు, ఇటు కార్మికులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తీసుకొచ్చిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అఖిలపక్ష, ట్రేడ్ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా పట్టణంలో సీపీఐ, సీపీఎం, ఎన్డీ, కాంగ్రెస్ నాయకులు, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, హెచ్ఎంఎస్, ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్, అండర్ బ్రిడ్జ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీలు, ట్రేడ్ యూనియన్ల నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ విధానాలతో నిరుపేదలకు ఏమాత్రం లబ్ధి జరగడం లేదన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ఈ పదేళ్ల కాలంలో ఎన్నో కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొచ్చి వారి పొట్టకొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేవలం ఒక్క శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు 140 కోట్ల ప్రజలతో ఊడిగం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సాదుల శ్రీనివాస్, ఎన్డీ నాయకులు లింగ్యా, కే రవి, జీ దేవేందర్, బీ ఐలయ్య, చిన్న చంద్రన్న, నవీ న్, ఏ రాజు, కే ఉపేందర్, రాజన్న, వెంకన్న, కోటేశ్, పాల్గొన్నారు.

తొర్రూరులో మహా ప్రదర్శన

తొర్రూరు : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, కార్పొరేట్ మద్దతు విధానాలను వ్యతిరేకించాలని వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు అన్నారు. గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలో వామపక్ష రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ఆంధ్రా బ్యాంకు మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బొల్లం అశోక్, ముంజంపల్లి వీరన్న, ఆలకుంట్ల సాయిలు, చిన్నాల స్వామి, భిక్షపతి, జమ్మల శ్రీను, హరీశ్, సోమిరెడ్డి, సాయిమల్లు, లక్ష్మణ్, దేవేందర్, ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు. సమ్మెకు మద్దతుగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కోశాధికారి నాగమల్లయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వీరన్న, ఉపాధ్యాయులు మంజుల, రజియాబేగం, సరిత, కల్యాణి, సునీత, హరికృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

గార్ల: మానవహారంగా ఏర్పడి ర్యాలీ తీస్తున్న పార్టీలు, కార్మిక సంఘ నాయకులు

బంద్ విజయవంతం

కురవి : బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కురవి, సీరోలు మండలాల్లో వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నల్లపు సుధాకర్, మల్లేడి కోటయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, పాపయ్య, మల్లయ్య, షేక్ మల్సూర్, మాలోత్ కిషన్, తురక రమేశ్, బుర్ర సమ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేకి మోదీ

ఇనుగుర్తి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులకు వ్యతిరేకమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెళ్లి సతీశ్ అన్నారు. భారత్ బంద్‌లో భాగంగా మండల కేంద్రంలోని షాప్‌లను మూసివేయించారు. రైతులు, జీపీ సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు

కేసముద్రం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. భారత్ బంద్‌లో భాగంగా అంబేద్కర్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్ వరకు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఎస్‌కేఎం, ఏఐకేఎఫ్ , కాంగ్రెస్, సీపీఐ ఎంఎల్ సంఘాల నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆయా సంఘాలు, పార్టీల నాయకులు అల్లం నాగేశ్వర్‌రావు, గుగులోత్ దస్రూనాయక్, అంబటి మహేందర్‌రెడ్డి, రావుల మురళి, కంచ వెంకన్న, భాస్కర్‌రెడ్డి, శివ్వారపు శ్రీధర్, చొప్పరి శేఖర్, ప్రవీణ్‌కుమార్, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, వివిధ కార్మిక సంఘాలు చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ డోర్నకల్‌లో విజయవంతమైంది. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, డీ మల్లేశం, జేవీఆర్, వెంకట్రాములు, నాగేశ్వర్‌రావు, ప్రబేశ్, సుమీర్ చందు జైన్, హరికృష్ణ, పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బయ్యారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. నాయకులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, బీ సూర్యం, నందగిరి వెంకటేశ్వర్లు, రాము, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి పాల్గొన్నారు.

తొర్రూరు: వామపక్ష కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గార్లలో..

గార్ల : మండలంలోని వ్యాపారులు, కార్మికులు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, సీఐటీయూ నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు కే శ్రీనివాస్, కట్టెబోయిన శ్రీనివాస్, సక్రు, హరి, జీ వెంకన్న, ఇమ్మడి గోవింద్ పాల్గొన్నారు.

కేంద్రం విధానాలను ఎండగట్టాలి

నెల్లికుదురు : గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా శుక్రవారం ప్రజా సంఘాల నాయకుల స్థానిక విశ్రాంతి భవనం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్సంపల్లి సైదులు, గుట్టయ్య, స్వామి, తూటి వెంకటరెడ్డి, అనిల్, నాగన్న, పుల్లయ్య, దస్తగిరి, లక్ష్మి, నర్సమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేటలో..

నర్సింహులపేట : గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా మండలకేంద్రంలో వివిధ పార్టీలు, అనుబంధ సంఘాల నాయకులు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, యాకూబ్, సతీశ్, దస్రు, యాదగిరి, భిక్షం, జ్యోతి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు తొత్తుగా బీజేపీ నిర్ణయాలు

పెద్దవంగర : మండల కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘంతోపాటు ఇతర అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్, ఏఐటీయూసీ నాయకులు మహేందర్, ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా బాధ్యుడు సురేశ్‌బాబు, సీఐటీయూ మండల కన్వీనర్ రాపోలు వీరన్న, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పీ స్వరూప, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం సాంబయ్య, లక్ష్మి, మంజుల, సాంబలక్ష్మి, రేణుక, ఎల్లయ్య, నరేశ్, కుమార్, శ్రీను, రాములు పాల్గొన్నారు.

చిన్నగూడూరులో..

చిన్నగూడూరు : గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా అంగన్‌వాడీలు, ఆశ, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, లింగన్న, సంధ్యారాణి, మంజుల, వెంకన్న, ఐలయ్య, యాకన్న పాల్గొన్నారు.

కొత్తగూడలో..

కొత్తగూడ, ఫిబ్రవరి 16 : గ్రామీణ భారత్ బంద్ మండలంలో విజయవంతమైందని భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకుడు బూర్క వెంకటయ్య అన్నారు. శుక్రవారం కొత్తగూడ మండల కేంద్రంలోని ర్యాలీ, నిరసన తెలిపారు. నాయకులు మంగన్న, రాంచంద్రు, వెంకన్న, లక్ష్మయ్య, పాపయ్య, ఈరెల్లి మల్లేశ్ పాల్గొన్నారు.



గూడూరు: మండల కేంద్రంలో రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ పార్టీల నాయకులు

గూడూరులో..

గూడూరు : దేశవ్యాప్త బంద్‌కు మద్దతుగా శుక్రవారం కాంగ్రెస్, ఎంసీపీఐయూ, సీపీఎంఎల్ ప్రజాపంథా పార్టీలు, సీఐటీయూ, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు మండల కేంద్రంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న, నాయకులు శ్రీపాల్‌రెడ్డి, రసూలు, చంటిస్వామి, శివ, సీపీఐయూ నుంచి నూకల ఉపేందర్, ప్రజాపంథా నుంచి భరత్, సీఐటీయూ నుంచి రాజమౌళి, మల్లేశ్, తిరుతమ్మ పాల్గొన్నారు.



డోర్నకల్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న నాయకులు, సంఘ ప్రతినిధులు

కురవి: రహదారిపై ఆందోళన చేస్తున్న పార్టీల నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు

చిన్నగూడూరు: మండల కేంద్రంలో ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

పెద్దవంగర: జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

బయ్యారం: జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షాల నాయకులు

కంప్యూటర్ల బహూకరణ

డోర్నకల్, ఫిబ్రవరి 16: డోర్నకల్ హైస్కూల్‌కు ఎస్‌బీఐ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.5లక్షల విలువైన ఐదు కంప్యూటర్లు, 11 తరగతి గదులకు రివాల్వింగ్ కుర్చీలు, టేబుళ్లను శుక్రవారం మేనేజర్ కుమారస్వామి హెచ్ఎం నరసింహారావుకు అందజేశారు. డిజిటల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి స్టూ డెంట్స్ వెల్ఫేర్ ఫండ్(ఎస్‌డబ్ల్యూఎఫ్)ను ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం తెలిపారు. ట్రస్ట్ చైర్మన్‌గా అప్పిరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్, కోచైర్మన్‌గా మంజులత, కోశాధికారిగా వసంతరాణి ఎంపికయ్యారు. హెచ్ఎం రూ.5వేలు, కమల 8ట్యూబ్‌లైట్లు, రెండు ఫ్యాన్లు, మంజులత, శ్రీనివాస్ రూ.వెయ్యి ట్రస్ట్‌కు అందజేశారు.

నిర్బంధాలను ఖండించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 16: ప్రజాఉద్యమాలపై నిర్బంధాలను ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుజ్జు దేవేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అక్రమంగా అరెస్ట్ చేసిన రాష్ట్ర కార్యదర్శి అజ్ఞాత దళనేత అశోక్, వరంగల్ జిల్లా కార్యదర్శి గోపన్నను వెంటనే విడుదల చేయాలన్నారు.

కోర్టులో హాజరుపర్చాలి

కొత్తగూడ: అరెస్ట్ చేసిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులను కోర్టులో హాజరుపర్చాలని జిల్లా నాయకుడు బూర్క వెంకటయ్య అన్నారు. పాకాల కొత్తగూడ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ నెల 14న సాయంత్రం ఖమ్మం నుంచి వస్తున్న అశోక్, గోపన్నతోపాటు మదార్, సురేశ్, ఖమ్మం జిల్లా నాయకుడు పుల్లన్నను 15న అర్ధరాత్రి మిర్యాలపెంటలో ఆయన ఇంటి వద్ద, గూడూరు మండలంలో జోగ రణధీర్, బయ్యారం మండలం కొత్తగూడెంలో భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేశారని, వారిని ఇంతవరకు కోర్టులో హాజరు పర్చలేదన్నారు.

చిన్నగూడూరు: సీపీఐ (ఎంఎల్)ఎండీ రాష్ట్ర కార్యదర్శి కురుసం వజ్జయ్య అలియాస్ అశోక్, జిల్లా కార్యదర్శి దాసరి సమ్మయ్య అలియాస్ గోపన్నను మహబూబాబాద్, ఖమ్మం సరిహద్దుల్లో పోలీసులు అరెస్టు చేశారని, వారిని వెంటనే కోర్టులో హాజరుపరచాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండపల్లి వెంకటేశ్వర్లు, వీరన్న డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న వారిని అరెస్టు చేయడం తగదన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 : గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు అన్నారు. శుక్రవారం జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. మొదటగా జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్‌ను స్పెషల్ అధికారుల పనితీరును అడిగి తెలుకున్నారు. అనంతరం పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధిపై సమీక్షించారు. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, జడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ బిందు

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 : ఇటీవల హైదరాబాద్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మండలంలోని అనంతారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఏ రామ్‌దీక్షిత్ బాస్కెట్‌బాల్‌లో, డీ హారిక అథ్లెటిక్స్‌లోని బ్రాండ్ జంప్, బీ ప్రత్యూష జిమ్నాస్టిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి, పీడీ వర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అమరావతి

మానవత్వం చాటుకున్న ఎస్సై

నర్సింహులపేట, ఫిబ్రవరి 16 : ఫిట్స్ వచ్చిన బాలికను తన పోలీస్ వాహనంలో దవాఖానకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నాడు ఓ ఎస్సై. శుక్రవారం మండలంలోని పడమటిగూడేనికి చెందిన బొబ్బెలి లింగమ్మ కుమార్తె స్వాతి తన మూడేళ్ల కూతురితో తల్లిగారి ఇంటికి వచ్చింది. తెల్లవారుజామున పాపకు జ్వరం రావడంతో ఉదయం దవాఖానకు తీసుకెళ్లేందుకు స్టేజీవద్దకు రాగా, ఫిట్స్ వచ్చింది. అదే క్రమంలో తొర్రూరు నుంచి నర్సింహులపేటకు వెళ్తున్న ఎస్సై సతీశ్ గమనించి పోలీస్ వాహనంలో పాపను దవాఖానకు తరలించాడు. తాను బైక్‌పై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పాపను దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్న ఎస్సై సతీశ్‌ను ప్రజలు అభినందించారు.

ముత్యాలమ్మతల్లి హుండీ లెక్కింపు

ఇనుగుర్తి, ఫిబ్రవరి16 : మండలంలోని చిన్ననాగారం ముత్యాలమ్మ తల్లి హుండీని శుక్రవారం గ్రామస్తులు లెక్కించారు. హుండీని లెక్కించగా మొత్తం రూ.1,45,250 వచ్చినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి వేద రాజేశ్వర్, మాజీ సర్పంచ్ జయపాల్‌రెడ్డి, బైరు అశోక్, శ్రీనివాస్, యాకాంతం, యాకూబ్, రమేశ్, గుండ్ల వెంకన్న పాల్గొన్నారు.

ఎన్డీ నాయకులను విడుదల చేయాలి

కేసముద్రం, ఫిబ్రవరి 16: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు అశోక్, గోపన్న, పుల్లన్నను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో అశోక్, గోపన్న ఈ నెల 14న, పుల్లన్నను ఈ నెల 15న అరెస్టు చేసి, ఇప్పటి వరకు చూపించలేదని ఆరోపించారు. వారిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలన్నారు. కార్యక్రమంలో శివ్వారపు శ్రీధర్, బట్టు నాగేశ్వర్‌రావు, రాజు, సకినాల ఐలయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపిక

ఇనుగుర్తి, ఫిబ్రవరి16 : మండలకేంద్రంలోని హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపికలు నెల్లికుదురులోని హైస్కూల్‌లో జరుగగా, అభిలాష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 17 నుంచి19 వరకు సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.



అభిలాష్

రథసప్తమి రోజు సూర్య నమస్కారం చేయాలి

మహబూబాబాద్, ఫిబ్రవరి 16 : రథసప్తమి రోజు ప్రతి ఒక్కరూ సూర్య నమస్కారం చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మాచార్యులు ఇమ్మడి రవికుమార్ కోరారు. శుక్రవారం ఏకశిల ఏంజిల్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, విద్యార్థులతో కలిసి టీ.టీ.డీ ధర్మాచార్యులు సూర్య నమస్కారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది మాఘశుద్ధ సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో రథసప్తమి పేరుతో ప్రత్యేక ఉత్సవం నిర్వహిస్తామన్నారు. సూర్య జయంతి ఉదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఏడు వాహనాల్లో శ్రీవారు విహరిస్తారని చెప్పారు. ప్రతి నిత్యం ఉదయం సూర్యనమస్కారం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

దంతాలపల్లి : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో 1993-94లో పదో తరగతి చదివిన అన్నావజ్జుల ప్రసాద్‌శర్మ, తాటికొండ ప్రవీణ్ రూ. 25వేల విలువైన ప్రింటర్‌ను శుక్రవారం పాఠశాల హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డికి అందజేశారు. పాఠశాలకు సహకరించిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కంప్యూటర్‌ను బహూకరిస్తున్న విద్యార్థులు

మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలి

నర్సింహులపేట, ఫిబ్రవరి 16: మహిళలు స్వయంకృషితో ఎదగాలని నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని పడమటిగూడెంలో నాబార్డు ఆర్థిక సహకారంతో మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు వారం రోజులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. మహిళలకు నాబార్డు సహకారంతో ఎస్‌బీఐ తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయాలని మేనేజర్‌కు సూచించారు. ఎస్‌బీఐ మేనేజర్ దిలీప్‌కుమార్, పశువైద్యాధికారి వినోద్, సాయి స్వచ్ఛంద సంస్థ సీఈవో వెంకన్న, రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల సీఈవో పర్శయ్య, డైరెక్టర్లు వీరూనాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ద్విచక్ర వాహనం చోరీ

మహబూబాబాద్ రూరల్ : పట్టణంలోని పులిగోపాల్‌రావు నగర్‌లో గురువారం రాత్రి ద్విచక్రవాహనం చోరీ జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన భూక్యా రవి గురువారం రాత్రి తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హ్యాండిల్ లాక్‌వైర్‌ను కట్ చేసి బైక్‌ను అపహరించారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE



★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1గజం భూమి, యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు, జీడికల్లు రామాలయ, ప్రసిద్ధ శివాలయం దగ్గర్లో, స్పాట్ రిజి. 100% వాస్తు. Cont: 9030769178. NTW-00

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720. NT-313892

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-319440

CHANGE OF NAME

★I, VEERAIAH BOLLIKONDA (Old Name), S/o. BOLLIKONDA GANGAIAH, R/o. H.No. 2-8-294/A, Raghavendra Nagar, Phase-II, NGO's Colony, Waddepally, Hanumakonda Dist., T.S., I have changed my name as VEERENDAR BOLLIKONDA (New name), S/o. BOLLIKONDA GANGAIAH, as per Aadhar Card. NTW-00

CHANGE OF NAME

★MALAY MAHESH, S/o. Ramaliingaiah, R/o. 2-5-90, Near Railway Station, Mahabubabad-506 101. Changed My Name as MALE MAHESH. NT-96594

★PASUPPULETI NAVEEN KUMAR, S/o. Yadhagiri, R/o. 4-4-83, Sai Mandir Road, Mahabubabad- 506101. Changed My Name as PASUPULETI NAVEEN KUMAR. NT-96594

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618 9182777213

WARANAGAL 9182777556 9182777557 9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777554

JANGAON - 9182777565